మామూళ్లు ఇవ్వాల్సిందే!

- డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వసూలు చేయిస్తున్న సబ్ రిజిస్ట్రార్లు
- నేరుగా స్టాంపు డ్యూటీ 7.5 శాతానికి బదులు 8.5 శాతం వసూలు
- డాక్యుమెంటేషన్‌కు రూ.1000 నుంచి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్న రైటర్లు
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మితిమీరిపోతున్న అవినీతి



కర్నూలు జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయల్లో అవి నీతి మితిమీరిపోతోంది. డాక్యుమెంట్ రైటర్లు, సబ్‌రిజిస్ట్రార్లు కుమ్మక్కై కార్యాలయాలకు వచ్చిన క్రయ, విక్రయదారులను దోచుకుంటున్నారు. కొందరు సబ్‌రిజిస్ట్రార్లు నేరుగా రైటర్లతో మార్కెట్‌విలువలో ఒక్కశాతాన్ని తమకు లంచంగా వసూలు చేయించుకుంటున్నారు.

ప్రశ్నిస్తే బయటకు వెళ్లమంటారు?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. అన్నింటిలో ఆస్తుల క్రయ, విక్రయాల ప్రక్రియలో భాగంగా స్టాంపు డ్యూటీ కింద మార్కెట్ విలువలో 7.5 శాతం మొత్తాన్ని చలానా రూపంలో ప్రభుత్వానికి చెల్లించాలి. ఇందులో 5.5 శాతం స్టాంపు డ్యూటీ, 1.5 శాతం ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, ఒక్క శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. దీనికి అదనంగా యూజర్ చార్జీ రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరు సబ్ రిజిస్ట్రార్లు 7.5 శాతానికి అదనంగా మరో ఒక్క శాతాన్ని వారికి లంచంగా సబ్ రిజిస్ట్రార్లకు డాక్యుమెంట్ రైటర్లు వసూలు చేసిపెడుతున్నారు. ఎవరైనా ఏమైనా అంటే సబ్‌రిజిస్ట్రార్‌కు ఇవ్వాలని వారు చెబుతుండడంతో చేసేదేమీ లేక వారు తలఊపాల్సి వస్తోంది. కాగా, ఒక్క శాతం అదనపు వసూలు అన్నది నిబంధనలు ప్రకారం ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే. ఏదైనా కొర్రీ ఉంటే ఎక్కువ సమర్పించుకోవాల్సిందే. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే మొదట కార్యాలయం నుంచి బయటకు వెళ్లు అంటారు. దీంతో విధిలేని పరిస్థితిలో క్రయ, విక్రయదారులు వాళ్లు అడిగిన మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తోంది.

ఉన్నతాధికారులకూ భాగం

సబ్ రిజిస్ట్రార్లు వసూలు చేసిన మొత్తంలో కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు భాగస్వాములు అని అంటుంటారు. సబ్ రిజిస్ట్రార్ తన పైస్థాయి అధికారులకు వసూలు చేసిన దానిలో నెల నెలా కొంత మొత్తం ఇవ్వాల్సి ఉంటుంది. ఇవ్వకపోతే వారిని ఇబ్బంది పెడుతుంటారని చెబుతుంటారు. పైగా సీనియర్ అసిస్టెంట్లకే ఎక్కువగా ఎస్ఆర్ఓ విధులు కేటాయిస్తారు. ఆ సమయంలోనే వారితో అన్నీ క్లియర్‌గా చెప్పి పంపుతుంటారు.

విక్రయదారులను పీడిస్తున్న రైటర్లు

మరోవైపు డాక్యుంట్ రైటర్లు క్రయ, విక్రయదారులను పీడించి పిప్పి చేస్తున్నారు. డాక్యుమెంట్ తయారు చేయడానికి ఏకంగా పార్టీలను బట్టి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొందరైతే మూడు వేలు కూడా తీసుకుంటున్నారు. వీరి దగ్గర కూడా ఏమి అనలేని పరిస్థితి. ఏమైనా అంటే డాక్యుమెంట్ తయారు చేసి ఇవ్వరు. దీంతో విక్రయదారులకు ఏం చేయాలో దిక్కుతోచడంలేదు.

ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతాం

మార్కెట్ విలువలో అదనంగా 1 శాతం వసూలు చేస్తున్నట్లు మాకైతే ఫిర్యాదు లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పూర్తిస్థాయి విచారణ జరుపుతాం. డాక్యుమెంట్ రైటర్ల దగ్గరకు వెళ్లకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్లనే క్రయ, విక్రయదారులు కలిస్తే మంచిది. విక్రయదారులే డాక్యుమెంటను తయారు చేసుకునే విధానం అమల్లో ఉంది.

– నానలింగేశ్వరరావు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్

వీఓఏ చేతివాటం..!

- పొదుపు గ్రూపు సభ్యులను మోసగించి రూ.4 లక్షలు డ్రా
- చర్యలు తీసుకోవాలంటున్న సంఘం సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన పొదుపు వీఓఏ గ్రూపు సభ్యులను మోసగించి డబ్బును డ్రా చేసి చేతివాటం చూపిన సంఘటన గురువారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన వెన్నెల గ్రూపు లీడర్లు ఉషారాణి, షబానా, గ్రూపు సభ్యులు లావణ్య, జ్యోతి, మహేశ్వరీ, ఏసమ్మ, శ్యామలమ్మ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఈ నెల 8న బ్యాంక్ లింకేజీ కింద తీర్మానం బుక్కులో వీఓఏ శివమ్మ సంతకాలు పెట్టించుకుంది. బ్యాంకులో లోన్ మంజూరు చేయిస్తాను అని చెప్పింది. గ్రూపు సభ్యులకు తెలియకుండానే పొదుపు సిబ్బందితో పాటు బ్యాంకు సిబ్బందితో కుమ్మక్కై రూ.4 లక్షలు డ్రా చేసుకుంది. మాకు రావాల్సిన డబ్బులు కొట్టేసిన వీఓఏ శివమ్మపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. విషయాన్ని ఏపీఎం ఉస్మాన్ దృష్టికి తీసుకెళ్లగా వాస్తవమే అని అంగీకరించారు. గ్రూపు సభ్యుల నుంచి ఫిర్యాదు అందిందని, వీఓఏ శివమ్మ నుంచి రికవరీ చేయించి గ్రూపును రద్దు చేస్తామని, బాధ్యులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపిం చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

హుసేనాపురంలో రీ సర్వే ప్రారంభం



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో భూముల రీ సర్వే ప్రారంభమైంది. మీ భూమి– మా హామీ కార్యక్రమంలో భాగంగా బుధవారం సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ భూమి పూజ చేసి సర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల విస్తీర్ణంలో తేడాలు ఉండడం మూలంగా రైతుల మధ్య వివాదాలు చోటు చేసుకునేవన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ సంరక్ష పథకాన్ని అమలు చేయడం సంతోషకరమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జేవీకే కిట్లను పరిశీలించిన డీఈఓ



యూనిఫారాల క్లాత్‌ను పరిశీలిస్తున్న డీఈఓ అనురాధ

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యార్థులకు అందజేస్తున్న జేవీకే కిట్లను (జగనన్న విద్యా కానుక)నంద్యాల జిల్లా డీఈఓ అనురాధ పరిశీలించారు. బుధవారం మండలానికి వచ్చిన కిట్లను ఆమె పరిశీలించారు. యూనిఫారం క్లాత్‌ను పరిశీలంచిన ఆమె పిల్లలకు సరిపడా గుడ్డ ఉందా లేదా.. నాణ్యత ఏమైన తగ్గిందా అనే విషయంపై ఆరా తీశారు. 2023–24విద్యా సంవత్సరానికి సంబధించి ఈ కిట్లను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, ఏపీఎం ప్రసాద్, సీసీ రఘు, హెచ్ఎం జిలానీ, సీఆర్‌పీ రాజశేఖర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

హాకీ జాతీయ స్థాయి పోటీలకు గార్గేయపురం విద్యార్థి



హాకీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రశాంత్‌ను అభినందిస్తున్న ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు (న్యూటౌన్): హాకీ జాతీయ స్థాయి పోటీలకు కర్నూలు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పెరుమాళ్ల ప్రశాంత్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రశాంత్‌ను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రం రూర్కెలాలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రశాంత్ పాల్గొంటారని జిల్లా హాకీ ముఖ్య కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు.

నేడు జూలకల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ నిర్వహించనున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దామోదర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి రోజు ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు ఎమ్మెల్యే వివరిస్తారన్నారు. రెండవ రోజు బీసీ, ఓసీ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారని ఆయన తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



సంక్షేమ పథకాల లబ్ధిదారుల లిస్టును పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. బుధవారం కల్లూరు మండంలం సల్కాపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, ఉద్యోగుల హాజరు పట్టికను, సంక్షేమ పథకాల క్యాలెండర్లను, లబ్ధిదారుల లిస్టలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రంలో ఎరువుల స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ప్రతి రోజు సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, పంచాయతీ కార్యదర్శి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలు



దుర్వేశి లక్ష్మీచెన్నకేశవ స్వామి

గడివేముల: మండల పరిధిలోని దుర్వేశి గ్రామంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవాలు ఈనెల 20,21 తేదిల్లో నిర్వహించనున్నారు. దాదాపు 25 ఏళ్ల అనంతరం నిర్వహిస్తున్న ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామస్తులు, పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 తేదీన శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఊరేగింపు చేయనున్నారు. ప్రారంభ ఉత్సవాలకు పాణ్యం ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు.

22న రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు

లక్ష్మీచెన్నకేశవస్వామి ఉత్సవాల్లో భాగంగా 22వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. గెలుపొందిన వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు చొప్పున బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే 22న రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలు ఉంటాయని తెలిపారు.

సచివాలయాల్లో స్పందన తప్పనిసరిగా నిర్వహించాలి



సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివశంకర్‌నాయక్

సి.బెళగల్: గ్రామ సచివాలయాల్లో ప్రతిరోజు స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, ఉద్యోగుల హాజరు, లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. అదేవిధంగా నమోదైన స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, పరిష్కార అంశాల వివరాలను సచివాలయ ఉద్యోగులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయాలలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ దస్తగిరి, పంచాయతీ కార్యదర్శి ఖాజాహుసేన్, వీఆర్వో జాకీర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ దేవర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: మండల పరిధిలోని అనుపూరు గ్రామంలో బుధవారం పెద్దమ్మ దేవర మహోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలో ప్రతిష్టించిన అమ్మవారికి పాణ్యం, బనగానపల్లె ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి, నాయకులు దస్తగిరిరెడ్డి, గుండం శేషిరెడ్డి, అధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. బంధువుల రాకతో గ్రామం కిక్కిరిసిపోయింది. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, నందివర్గం ఎస్ఐ రామాంజినేయరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మమ్మ, పుల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ, వీరయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సురేష్, వెంకటసుబ్బయ్య, కరుణాకర్‌రెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, ఈశ్వరయ్య, ప్రదీప్ రెడ్డి, నాగోషులు, మహేంద్రారెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి,రామలక్ష్మయ్య, చందమామ బాబు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో పునః నిర్మించిన మారెమ్మ యాడి గుడిలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవిబాయ్, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీబాయ్, నాయకులు చంద్రానాయక్, లక్ష్మానాయక్, వెంకటేష్‌నాయక్ పాల్గొన్నారు.

డీటీ నాయక్ పూజలు

రిటైర్డ్ అడిషినల్ డీజీపీ డీటీ నాయక్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి హోమం, ఇతర పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

ఏపీయూఎఫ్ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ మన్నె కరుణాకర్ కుమార్తె వివాహం కొణిదేడు గ్రామంలో జరిగింది. నూతన వధువరులను ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డి, కృష్ణారెడ్డి, సారంగపాణి పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమణ

కల్లూరు: స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) రమణ అన్నారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులు సకాలంలో పూర్తి చేయలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ప్రజలకు సేవలు అందించండి

- సమయానికి రాని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు మెమో
- ప్యాలకుర్తిలో పర్యటించిన స్పెషలాఫీసర్ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి

కోడుమూరు రూరల్: ఉద్యోగులు అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కోడుమూరు మండల స్పెషలాఫీర్, జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామ ఒకటవ సచివాలయాన్ని స్పెషలాఫీసర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మ విధులకు అలస్యంగా రావడంతో మెమో జారీ చేయమని పంచాయతీ కార్యదర్శి మురళీని ఆదేశించారు. సమయపాలన పాటించాలని, మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు తప్పనిసరిగా స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. అదేవిధంగా బాధితుల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి చిన్నారులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని జగనన్న కాలనీని స్పెషలాఫీసర్ సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్ణీత గడువులోగా ఇళ్లను నిర్మించుకోవాలని, ప్రభుత్వ అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మండల అధికారులతో సమీక్షా సమావేశం

అనంతరం స్పెషలాఫీసర్ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి కోడుమూరు చేరకుని స్థానిక వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్, హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏపీఎం పుష్పావతి, పీఆర్ ఏఈ గంగరాజుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, జగనన్న గృహ నిర్మాణ పథకం కింద నిర్మితమవుతున్న ఇళ్ల పురోగతిపై చర్చించారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధి
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



లబ్ధిదారుడికి వర్తించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

గూడూరు రూరల్: పేదరిక నిర్మూలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. పార్టీలు, వర్గాలు, ప్రాంతాలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండల పరిధిలోని జూలకల్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలతో కలిసిన స్థానిక నాయకులు దామోదర్‌రెడ్డి, దేవారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఏలియా రాముడు, యేసేపు, ఈరన్న, మల్లేష్, డినియేలు, జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, గూడూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారుతులు పట్టి తిలకందిద్ది స్వాగతించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం అధికారులు, నాయకులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. విద్యుత్, తాగునీటి సమస్య ఉందని, ఫ్లోరైడ్ నీరు తాగలేక ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను నివాసాలకు దూరంగా ఎత్తులో ఏర్పాటు చేయిస్తామన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని గుర్తు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయని, మధ్యవర్తిత్వం అనే మాట లేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్త్రీలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మాధవీలత, పీఆర్ ఏఈ గోపాల్‌రావు, నరసింహారెడ్డి, చాకలి నాగరాజు, పెంచికలపాడు రాముడు, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే విమర్శలు....

ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేకనే చంద్రబాబు నాయుడు, లోకేష్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని, అసత్యారోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ధ్వజమెత్తారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మభ్యపెట్టేందుకే వారు పాదయాత్రలు, సభలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలన వ్యత్యాసాలను ప్రజలు గమనించాలని కోరారు. నేరుగా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, సేవలు అందజేసే ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు.

సమాచార హక్కు చట్టం బోర్డులో మారిన పేర్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమాచారా హక్కు చట్టం బోర్డులో అధికారుల పేర్లు మారడం లేదని 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 3వ తేదీన 'పేర్లు మారవేమీ?' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన కర్నూలు రూరల్ తహసీల్దార్‌కార్యాలయ అధికారులు గతంలో పని చేసిన అధికారుల పేర్లను తొలగించారు. ప్రస్తుతం కర్నూలు రూరల్ తహసీల్దార్‌గా పని చేస్తున్న (పౌర సమాచార అధికారి) ఆర్ శివరాముడు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్ సహారాబాను (సహాయ పౌర సమాచార అధికారి) పేర్లను బోర్డుపై రాయించారు.

జీవనోపాధులను మెరుగు చేసుకోవాలి

కల్లూరు: ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా జీవనోపాధులను మెరుగు పర్చుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం తడకనపల్లె గ్రామంలో ఉల్లి సోలార్ డ్రయర్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ యూనిట్ 2లక్షలు కాగా అందులో రూ.20వేలు కంట్రిబూషన్ ఉంటుందని, రూ. 90వేలు మిషన్, రూ. 90వేలు షేడు నిర్మాణానికి బ్యాంక్‌లోన్ సౌకర్యం ఉంటుందన్నారు. అందుల్లో 35శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఎం శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణకు స్వచ్ఛతే ప్రధానం



సామూహిక మరుగుదొడ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛతే ప్రధాన మార్గమని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం 38వ వార్డు మునగాలపాడులో నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ.9.80లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను మేయర్, ఎమ్మెల్యే శిలాఫలకాన్ని, సామూహిక మరుగుదొడ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో 100 శాతం స్వచ్ఛతే లక్ష్యంగా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. అందులో భాగంగానే నగరంలోకి విలీనమైన గ్రామీణ ప్రాంతాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి సామూహిక మరుగుదొడ్లు ఎంతో అవసరమన్నారు. బహిరంగ మల విసర్జన నివారణకు సామూహిక మరుగుదొడ్లను త్వరితగతిన నిర్మిస్తున్నామని అన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన మైనారిటీ కమ్యూనిటీ హాలును మేయర్, ఎమ్మెల్యే పరిశీలించారు. హాలులో వంటగది, మరుగుదొడ్లు అవసరమని స్థానిక ప్రజలు వీరి దృష్టికి తీసుకురావడంతో వెంటనే రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సుంకన్న, ఎర్ర పక్కీరన్న, మహేష్‌గౌడు, శేషన్న, మాజీ సర్పంచ్ మాదన్న, కోఆప్షన్ మెంబర్ నయీం పాషా, ఎంఈ షాకీర్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం చేయండి



సిబ్బందితో సమావేశమైన జిల్లా వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్బీకేలలో విధులు నిర్వర్తించే సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఖరీఫ్ సాగుకు అన్నివిధాలుగా సన్నద్ధం చేయాలని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో వీఏఏలు, వీహెచ్ఏలు, ఎంపీఈఓలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏడీఏతోపాటు డీఆర్‌సీ డీపీడీ శ్రీలత, డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏఓ మధుమిత హాజరై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని గ్రామాలలోని ఆర్బీకేలలో ఎరువులు, విత్తనాలు, ముందస్తుగా రైతులకు అందుబాటులో ఉంచిందని, రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: మండల పరిధిలోని తడకనపల్లె గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరుకానున్నరన్నారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నాలని పేర్కొన్నారు.

20న మండల మీట్

గడివేముల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 20న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగమల్లేశ్వరప్ప బుధవారం తెలిపారు. సమావేశానికి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను 18వ తేదీ లోపల సమర్పించాలని సూచించారు.